

ఓటు చోరీ సంతకాల పత్రాల అందజేత

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజల నుంచి సేకరించిన ఓటు చోరీ సంతకాల పత్రాలను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ బుధవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఓటు చోరీ సంతకాల సేకరణకు టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ఇచ్చిన పిలుపుమేరకు జిల్లాలో 27వేల సంతకాలను సేకరించామన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో సేకరించిన ఓటు చోరీ సంతకాల పత్రాలను ఈనెల 14న రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో ఢిల్లీలోని లీలామైదాన్‌లో జరిగే ర్యాలీ అనంతరం రాష్ట్రపతికి పంపిస్తారని అన్నారు.

గ్రామపంచాయతీలకు భారీగా పన్నుల వసూలు

ఇల్లంతకుంట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల పంచాయతీ కార్యాలయాలకు రూ 9.75లక్షల పన్నులు వసూలు అయ్యాయి. ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థులతో పాటు ప్రతిపాదకుడు గ్రామపంచాయతీ ద్వారా నోడ్యూస్ సర్టిఫికెట్ ఉండాలనే నిబంధన ఉండటంతో పన్నులు చెల్లించారు. మండలంలోని వివిధ గ్రామాలలో మూడురోజుల పాటు కొనసాగిన నామినేషన్ల సందర్భంగా ఇంటిపన్నులు చెల్లించి సహకరించారని ఎంపీఓ శ్రీనివాస్ తెలిపారు.

జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులో కేటీఆర్ వాహనం తనిఖీ..

తంగళ్లపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో సిరిసిల్ల పర్యటనకు వస్తున్న మాజీ మంత్రి కె.తారకరామారావు వాహనాన్ని సిబ్బంది తనిఖీ చేశారు. బుధవారం హైదరాబాద్ నుంచి సిరిసిల్ల పర్యటనకు వస్తున్న కేటీఆర్ కాన్వాయ్‌ను జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులో సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

మృతదేహాన్ని స్వదేశానికి తెప్పించండి..

- కేటీఆర్‌ను కోరిన బాధిత కుటుంబం

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి నిమిత్తం సౌదీకి వెళ్లి గుండెపోటుతో మృతిచెందిన భర్త మృతదేహాన్ని తొందరగా స్వదేశానికి తెప్పించండి అంటూ భార్య గుగులోతు మంజుల కేటీఆర్‌ను కోరింది. బుధవారం జిల్లా కేంద్రం తెలంగాణ భవన్‌కు వచ్చిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్‌ను బాధిత కుటుంబం కలిసి విజ్ఞప్తి చేసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మంజుల తన బాధను కేటీఆర్‌కు వెల్లబుచ్చారు. ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గుంటపెల్లి చెరువు తండాకు చెందిన గుగులోతు రవి ఉపాధి నిమిత్తం ఏడాది క్రితం సౌది అరేబియా విజిట్ వీసాపై వెళ్లాడని గుండెపోటుతో ఈనెల 6న మృతిచెందాడంటూ బోరుమంది. తన భర్త మృతదేహాన్ని స్వదేశానికి తీసుకురావడానికి తనకు ఆర్థిక స్తోమత లేదని, త్వరగా ప్రభుత్వం ద్వారా రవి మృతదేహాన్ని తీసుకువచ్చే విధంగా చూడాలంటూ కేటీఆర్‌ను వేడుకుంది. దీంతో కేటీఆర్ స్పందించారు. రవి మృత దేహాన్ని స్వగ్రామానికి తీసుకురావడానికి అధికారులతో మాట్లాడుతానని కేటీఆర్ భరోసా కల్పించారు.

నేడే తొలి తీర్పు..



డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద పోలింగ్ సిబ్బంది

- కొద్ది గంటల్లోనే తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- తొలి దశ పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు
- ఐదు మండలాల్లో 76 సర్పంచ్, 516 వార్డులకు పోలింగ్
- ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్
- మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు.. ఫలితాలు వెల్లడి
- 700 మంది పోలీసు బందోబస్తు.. 14 సమస్యాత్మక గ్రామాలు
- ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్.. బందోబస్తు పర్యవేక్షించిన ఎస్పీ

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

తొలి విడత పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధమైంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మూడు దశల్లో జరుగుతున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో గురువారం తొలిదశ పోలింగ్, ఫలితాల వెల్లడించి, ఉపసర్పంచ్ ఎన్నిక పూర్తి చేయడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. తొలి విడతలో రుద్రంగి, చందుర్తి, వేములవాడ, వేములవాడ రూరల్, కోనరావుపేట మండలాల్లో ఏకగ్రీవ అభ్యర్థులను మినహాయిస్తే.. పోటీలో ఉన్న అభ్యర్థుల భవితవ్యం కొద్ది గంటల్లోనే తేలిపోనున్నది.

తొలి విడత పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సిబ్బంది బుధవారం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారు. జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ గరీమ అగ్రవాల్ ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వారి పోలీసు బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ మహేష్ బీ గీతే పర్యవేక్షించారు.

521 పోలింగ్ కేంద్రాలు.. 2033 మంది పోలింగ్ సిబ్బంది

తొలి విడత ఎన్నికల నిర్వహణకు 521 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్లు లెక్కించి విజేతను ప్రకటిస్తారు. అనంతరం ఉపసర్పంచ్ ఎన్నికను నిర్వహిస్తారు. ఎన్నికల నిర్వహణకు 2033 మంది సిబ్బందిని నియమించారు. పీఓలు 898 మంది, ఓపీవోలు 1135 ఉన్నారు.

సర్పంచ్ అభ్యర్థులు 295 మంది, వార్డు అభ్యర్థులు 1377 మంది

జిల్లాలోని ఐదు మండలాల్లో 76 సర్పంచ్, 516 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించడానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. సర్పంచ్ స్థానాల్లో 295 మంది అభ్యర్థులు, వార్డు స్థానాలు 1377 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. సర్పంచ్ స్థానాల్లో 9 మంది సర్పంచులు, 229 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవమయ్యాయి. రుద్రంగి మండలంలో 10 గ్రామ పంచాయతీలు ఉండగా గిరిజన తండాల్లో ఏడు గ్రామ పంచాయతీలు, కోనరావుపేటలో రెండు పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. ఏకగ్రీవ సర్పంచులో రుద్రంగి మండ లంలో అడ్డబోరు తండా సర్పంచ్‌గా గూగులోతు మంజుల, గైదీగుట్ట తండా సర్పంచ్‌గా ఇస్లావత్ కిషన్, వీరునితండా సర్పంచ్‌గా గుగులోతు మంజుల, చింతామణితండా సర్పంచ్‌గా గుగులోతు సింధుజ, బడితండా సర్పంచ్‌గా మాలోతు రాందాస్, రూప్లానాయక్ తండా సర్పంచ్‌గా భూక్య జవహర్‌లాల్, సర్పంచ్ తండా సర్పంచ్‌గా మాలోత్ రజితలతో పాటు వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోనరావుపేట మండలంలో ఊరుతండా సర్పంచ్‌గా ఇస్లావత్ మంజుల, కుమ్మరిపేటతండా సర్పంచ్‌గా మాలోతు మంజులలు వార్డు సభ్యులతో సహా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

భారీ పోలీసు బందోబస్తు

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ జరిగే విధంగా భారీ పోలీసు

మిగతా 8వ పేజీలో..

తొలి విడతలో 1,11,100 మంది ఓటర్లు

జిల్లాలో 260 గ్రామపంచాయతీలో 3,53,351 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,70,772 మంది, మహిళలు 1,82,559 మంది ఉన్నారు. మొదటి విడతలో 1,11,100మంది ఓటర్లు ఉండగా పురుషులు 53,517 మంది,మహిళలు 57,616 మంది ఉన్నారు.

మండలం	జీపీలు	వార్డులు	పురుషులు	మహిళలు	మొత్తం
రుద్రంగి	3	34	5,190	5,904	11,094
వేములవాడ	11	90	8953	9,523	18,476
వేములవాడ రూరల్	17	104	9,020	9,805	18,825
కోనరావుపేట	26	143	16,876	17,735	34,611
చందుర్తి	19	145	13,445	14,649	28,094
మొత్తం	76	516	53,517	57,616	1,11,100

బరిలో సర్పంచ్ అభ్యర్థులు 295 మంది, వార్డు అభ్యర్థులు 1377 మంది

జిల్లాలో తొలి విడతలో ఐదు మండలాల్లో 85 సర్పంచ్ స్థానాలు ఉండగా తొమ్మిది స్థానాల్లో ఏకగ్రీవం కాగా 76 గ్రామ పంచాయతీలు 295 మంది సర్పంచ్ అభ్యర్థులు, 229 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవం కాగా 516 వార్డుల్లో 1377 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

మండలం	సర్పంచ్	వార్డులు
రుద్రంగి	10	91
వేములవాడ	47	218
వేములవాడ రూరల్	52	262
కోనరావుపేట	122	459
చందుర్తి	64	347
మొత్తం	295	1377









డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, సిబ్బంది వెళ్లే బస్సులను ప్రారంభిస్తున్న గరిమ అగ్రవాల్, సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు తరలివెళుతున్న సిబ్బంది

విజయమ్మకు అండగా నిలవడానికి ఏకమైన కుల సంఘాలు



విజయమ్మ పక్షాన ప్రచారం చేస్తున్న గ్రామస్థులు

ఇల్లంతకుంట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : చింతపల్లి విజయమ్మకు అండగా నిలవడానికి కులసంఘాలు అన్ని ఏకమయ్యాయి. ఇల్లంతకుంట మండలం కందికట్కూర్ గ్రామసర్పంచ్‌గా పోటీచేస్తున్న విజయమ్మ పక్షాన తనయుడు వేణురావు గ్రామస్థులతో కలిసి తమకు కేటాయించిన బ్యాట్ గుర్తుతో ఇంటింటి ప్రచారాన్ని బుధవారం చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సర్పంచ్ ఎన్నికల్లో తనకు మద్దతు ఇచ్చి గెలిపిస్తే గ్రామాన్ని అన్నిరంగాలలో అభివృద్ధి చేస్తానని ఇస్తున్న హామీకి ప్రజల నుంచి చక్కని స్పందన లభిస్తుంది. గ్రామంలో సామాజిక కార్యక్రమాలతోపాటు ఆపదలో ఆదుకున్న విజయమ్మ కుమారుడు వేణురావు సేవలను ప్రజలు గుర్తుచేస్తున్నారు. ప్రజలకు మౌళిక వసతుల కల్పనతోపాటు పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తిచేస్తానని హామీఇస్తున్నారు. విజయమ్మను గెలిపించడం ద్వారా గ్రామం ఆదర్శంగా మారే అవకాశం ఉందని ఓటర్లు అభిప్రాయపడుతున్నారు. గ్రామాభివృద్ధికి ప్రత్యేకమైన ప్రణాళికతో ముందుకు రావడం, గ్రామంలో వైద్యశిబిరాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి కృషిచేస్తానని ఇస్తున్న హామీలతో బ్యాట్ గుర్తుకు ఓటు వేసి విజయమ్మను భారీమెజార్టీతో గెలిపిస్తామని ప్రజలు పేర్కొంటున్నారు.

రాజును సర్పంచ్‌గా గెలిపిస్తామంటున్న యువకులు



ఇల్లంతకుంటలో ప్రచారం నిర్వహిస్తున్న మామిడి రాజు

ఇల్లంతకుంట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యావంతుడైన మామిడి రాజును సర్పంచ్‌గా గెలిపిస్తామని మేధావులు, యువకులు పేర్కొంటున్నారు. ఇల్లంతకుంట సర్పంచ్ అభ్యర్థిగా పోటీచేస్తున్న మామిడి రాజు తనకు కేటాయించిన కత్తెర గుర్తుకు ఓటువేయాలని బుధవారం వివిధ సంఘాల నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఎలాంటి పదవి లేకపోయినా రాజు క్రీడాకారుల కోసం ఆటస్థలం కోసం అలుపెరగని పోరాటం చేశాడని, ఎక్కడ క్రీడలు జరిగినా క్రీడాకారులను ప్రోత్సహించి, సహాయసహకారులు అందించిన ఘనత రాజుకు ఉందని పేర్కొంటున్నారు. విద్యార్థులు ఎదుర్కొన్న సమస్యలను తొలగించడానికి అధికారులతో మాట్లాడడం జరిగిందని అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగం వచ్చే అవకాశం ఉన్నా ప్రజలకు సేవలచేయాలనే లక్ష్యంతో ముందకు వచ్చినందున తాము ఓట్లు వేయడమే కాకుండా తల్లిదండ్రులతోపాటు చుట్టుపక్కల వారి ఓట్లు వేయిస్తామని యువకులు బాహాటంగా పేర్కొంటున్నారు. రాజును గెలిపించడానికి గ్రామస్తులందరు ఏకతాటిపైకి వచ్చారని, కత్తెర గుర్తు ప్రజల్లోకి చొచ్చుకుపోయిందని పలువరు అభిప్రాయపడుతున్నారు. ఎమ్మెల్యే సహకారంతో రాజు గెలువడం ద్వానా అన్ని గ్రామం అన్నిరంగాలలో పురోభివృద్ధి చెందుతుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పల్లెల్లో నోట్ల పంట..

- ఓటుకు రూ వెయ్యి నుంచి రూ 2 వేల వరకు నజరానా..

- రూ.30 లక్షల నుంచి 50లక్షల వరకు సర్పంచ్ అభ్యర్థుల ఖర్చు

- తొలి విడతలో 295 మంది సర్పంచ్..1377మంది వార్డు అభ్యర్థులు



పోలీసులు పట్టుకున్న మద్యం(ఫైల్)

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

గ్రామపంచాయతీ ఎన్నికలు ఖరీదుగా మారాయి. నామినేషన్ల దాఖలు నుంచి మద్యం, దావతులతో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు చేసిన అభ్యర్థులు బుధవారం రాత్రి మద్యంతో పాటు ధన ప్రవాహాన్ని చూపించారు. పల్లెల్లో తొలినోట్ల పంట ఓటర్ల చేతికి వస్తోంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మూడు దశల్లో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో 233 సర్పంచ్ స్థానాల్లో 860 మంది అభ్యర్థులు,1948 వార్డుల్లో 4300 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. గురువారం తొలి విడతలో రుద్రంగి, చందుర్తి, వేములవాడ, వేములవాడ రూరల్, కోనరావుపేట మండలాల్లో పోలింగ్ నిర్వహించి ఫలితాలు వెల్లడిస్తారు. తొలి విడతలో 76 సర్పంచ్ స్థానాల్లో 295 మంది అభ్యర్థులు, 519 వార్డుల్లో 1377 మంది పోటీలో ఉన్నారు. గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు ఖర్చుకు వెనకాడడం లేదు. ఒక్కో అభ్యర్థి రూ 30 లక్షల నుంచి రూ 50 లక్షల పైన ఖర్చు పెట్టారు. కొందరు కోటి రూపాయల వరకు వెళ్లారు. ఓట్లు సంపాదించుకోవడానికి అభ్యర్థులు నోటు, మద్యాన్ని ప్రధానంగా ముందుకు తీసుకొచ్చారు. ఒక్క ఓటుకు రూ వెయ్యి నుంచి రూ 2వేల వరకు పంపిణీ చేశారు. దీంతోపాటు ఉద్యోగాలు, చదువులు, ఉపాధి రిత్యా వివిధ ప్రాంతాల్లో ఉన్న వారికి రవాణా ఖర్చులతో పాటు నజరానాలు ఇచ్చి రప్పించారు. అభ్యర్థులకు ఖర్చులు తడిసి మోపడుతున్న పదవి వ్యామోహంలో పట్టించుకోవడం లేదు. ఒక్కో గ్రామంలో ఇద్దరూ, ముగ్గురు సర్పంచ్ అభ్యర్థులు ఉంటే ఒక్కో కుటుంబంలో కనీసం ఆరు ఓట్ల వరకైనా ఉంటాయి. రూ 10 వేల నుంచి రూ 15 వేల వరకు గంపగుత్తగా ఇస్తూ ఓట్లను అర్థించారు. మరోవైపు మద్యం పంపిణీ చేపట్టారు. పోలీసులు మద్యాన్ని పట్టుకున్న ప్రవాహానికి అడ్డుకట్ట వేయలేకపోయారనే చర్చ జరుగుతుంది.

రేవంత్‌రెడ్డి పాలనలో ఓనర్ నుంచి ఆటోడ్రైవర్..

- ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలే - మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్



కేటీఆర్ చేతుల మీదుగా బీమా కార్డును తీసుకుంటున్న ఆటో డ్రైవర్లు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ ప్రభుత్వంలో ఆటోడ్రైవర్లను డ్రైవర్ నుంచి ఓనర్ చేయాలని చూస్తే రేవంత్‌రెడ్డి పాలనలో ఓనర్ నుంచి ఆటోడ్రైవర్ అవుతున్నారని మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ భవన్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అధ్యక్షతన ఆటో డ్రైవర్లకు ఆత్మీయభరోసా సభ జరిగింది. ముఖ్యఅతిథి కేటీఆర్ హాజరై మాట్లాడారు. ఆటో అన్నలతో తమకు కొత్త బంధం కాదని, తెలంగాణ ఉద్యమంలో సంబండ వర్గాలతో కలసి కొట్లాడామని, అందులో వారి పాత్రను మరవలేమన్నారు. రాష్ట్రంలో దాదాపు 7లక్షల మంది ఆటో డ్రైవర్లు ఉన్నారని, వారు అడగకముందే నాడు ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.5లక్షల ప్రమాద బీమా సౌకర్యాల కల్పించాడన్నారు. అసంఘటిత రంగంలో ఉన్న దాదాపు 13 లక్షల మంది డ్రైవర్లకు కూడా ప్రమాద బీమాను కల్పించాడన్నారు. కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అయి ఉంటే ప్రతి ఒక కుటుంబానికి బీమా వచ్చేదన్నారు. బీడీలు చుట్టే నాలుగున్నర లక్షల ఆడబిడ్డలకు రూ.2వేలు పెన్షన్ ఇచ్చి కేసీఆర్ కార్మిక పక్షపాతిగా నిలబడ్డారన్నారు. మార్పు మార్పు అనే మోసం ఎట్లా ఉంటుందో రెండు సంవత్సరాలో అందరూ చూశారన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి చేతులో మోసపోని ఏవర్గం ప్రజలు లేరని ఆరోపించారు. రైతులు, కౌలు రైతులను మోసం చేశాడని బోనస్ ఇస్తానని మోసం చేశాడన్నారు. రెండు లక్షల రైతు రుణాలు మొత్తం ఇవ్వాలంటే రూ 50 వేల కోట్లు ఇవ్వాలని వీళ్లిచ్చింది రూ.12 వేల కోట్లు మాత్రమే, దేవుళ్లపై ఓట్లు వేసి మాటతప్పారని ఆరోపించారు. కేసీఆర్ కొలువు పోతేను కొత్త కొలువులు వస్తాయని సంత్సరానికి 2లక్షల ఉద్యోగాలిస్తామంటే తల్లిదండ్రులు కూడా ఓటేసి గెలిపిస్తే వాళ్లను కూడా రేవంత్‌రెడ్డి మోసం చేశాడని విమర్శించాడు. అత్తకు రూ.4వేలు, కోడలుకు రూ.2500 ఇస్తానని రాష్ట్రంలోని కోటి 67లక్షల ఆడబిడ్డలను కూడా మోసం చేశాడన్నారు. ఆడబిడ్డలకు తులం బంగారు, చదువుకునే ఆడపిల్లలకు స్కూటీలు ఇస్తానన్నాడి ఇచ్చిండా అని ప్రశ్నించాడు. ఎల్లారెడ్డిపేట ఆటోడ్రైవర్ ఆత్మహత్యాయత్నం కల్చివేసిందని జిల్లాలోని ప్యాసింజర్, ట్రాలీఆటోలు, జీప్‌లు, వ్యాన్‌లు, లారీలు, టాక్సీలు, ట్రాక్టర్ డైవర్ల లిస్టులు కూడా తీయాలని వారికి కూడా సంక్రాంతి వరకు ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తామన్నారు. జిల్లాలోని ఆటో డ్రైవర్లందరికి ఉచితంగా చల్మెడ ఆనందరావు ఆసుపత్రిలో వైద్యం అందిస్తామన్న చల్మెడ లక్ష్మీనరసిహరావుకు ధన్య వాదాలు తెలిపారు. జిల్లాలో ఆటో డ్రైవర్లందరు క్రెడిట్ సొసైటీగా ఏర్పడితే కొన్ని రుణాలు వస్తాయని సూచించారు. 16 సంత్సరాల క్రితం కేసీఆర్ కొట్లాడితేనే తెలంగాణ వచ్చిందని కాంగ్రెసోడు ఏది మార్యాద గా ఇయ్యడు గల్లపట్టుకోవాల క్యారే అంటే ఇస్తాడన్నారు. నాలుగు నెల లో అన్ని జిల్లాలో ఆటో సంఘాలను సంఘటితం చేయాలని రాబోయే బడ్జెట్‌లో ప్రభుత్వం ఆటో సంక్షేమ బోర్డును పెట్టకపోతే ఫిబ్రవరిలో హైదరాబాద్ వేదికగా మహాధర్నాకు దిగుదాం అన్నారు. అనంతరం జిల్లాలోని 5వేల మంది ఆటోడ్రైవర్లకు ప్రమాదబీమా కార్డును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్రకార్యదర్శి గూడూరి ప్రవీన్, వేములవాడ నియోజకవర్గం ఇంచార్జి చల్మెడ లక్ష్మీనర్సింహరావు, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్, జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయం మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, ఉమ్మడి జిల్లా మాజీ జడ్పీ చైర్ పర్సన్ తుల ఉమ, జిల్లా మాజీ జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు, ఆటో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బొల్లి రామ్మోహన్, అధ్యక్షుడు అల్లె శ్రీనివాస్, వివిధ మండలాల ఆటో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాముల తనిఖీ



సిరిసిల్ల సర్ధాపూర్‌లోని ఈవీఎం గోదాంను పరిశీలిస్తున్న ఎన్నికల సంఘం సీఈవో

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సర్ధాపూర్ వ్యవసాయమార్కెట్ యార్డులో గోదాముల్లో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)లను బుధవారం ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బీ గీతేలతో కలిసి ఎన్నికల సంఘం సీఈవో సుదర్శన్‌రెడ్డి పరిశీలించారు. సాధరణ ఎన్నికల తనిఖీల్లో భాగంగా సిరిసిల్ల సమీకృత జిల్లా కలెక్టరేట్‌కు వచ్చిన ఎన్నికల సంఘం సీఈవో సదర్శన్‌రెడ్డికి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా ఎస్పీ మహేష్ బీ గీతేలు పూల మొక్కలను అందించి స్వాగతం పలికారు, ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణపై జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌తో చర్చించారు. అనంతరం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సర్ధాపూర్ వద్ద ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డు గోదాంలో భద్రత పరిచిన ఈవీఎంలను రాజకీయ ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ మహేష్‌కుమార్, ఎన్నికల సెక్షన్ అధికారి రెహమాన్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలు ఆదరిస్తున్నారు..

-ఉత్తమ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుతా



ఓటు అభ్యర్థిస్తున్న సర్పంచ్ అభ్యర్థి మోర లక్ష్మీరాజం

తంగళ్లపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థి మోర లక్ష్మీరాజంను అన్ని వర్గాల ప్రజలు ఆదరిస్తున్నారు. బుధవారం తంగళ్లపల్లిలో మోర లక్ష్మీరాజం తన మద్దతు దారులతో కలిసి గడప గడపకూ తిరుగుతూ రిమోటు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా మోర లక్ష్మీరాజం మాట్లడుతూ తంగళ్లపల్లిని అభివృద్ధి చేసి ఉత్తమ గ్రామ పంచాయతీగా నిలబెడతానని అన్నారు. పెద్దమ్మ గుడి నుండి ఎల్లమ్మ దేవాలయం వరకు సిసి రోడ్డు నిర్మాణం చేపడతానని, ప్రతి నాల్గు వార్డులకు ఒక చిల్డ్రన్ పార్కులు ఏర్పాటు చేస్తానని తెలిపారు. అన్ని కుల సంఘాలకు అందుబాటులో ఉండి అభివృద్ధికి పాటు పడతానని అన్నారు. అన్ని కుల సంఘాలు, మహిళ సంఘాలు తనకు మద్దతు తెలుపుతున్నాయన్నారు. బ్యాలెట్ నంబరు 6 రిమోటు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మద్దతుదారులు, మహిళలు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని చికిత్స పొందుతూ ఒకరి మృతి


రాజయ్య(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ఢీకొని చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని జాఫర్‌ఖాన్ పేటలో జరిగింది. గ్రామానికి చెందిన చీదురు రాజయ్య(50) ఇందిరమ్మ ఇళ్లు కట్టుకోవడం కోసం మండలంలోని ఇదిలాపూర్ గ్రామానికి చెందిన అల్లం రమేష్ ట్రాక్టర్‌తో మట్టి తరలిస్తున్నాడు. గతనెల 23నఇంటి నిర్మాణానికి మట్టి తరలిస్తుండగా అల్లం రమేష్ కుమారుడు అల్లం శేష్ కుమార్ ట్రాక్టర్ నడుపుతూ చీదురు రాజయ్యను ప్రమాదవశాత్తు ఢీకొట్టాడు. దీంతో తీవ్రగాయాలైన రాజయ్యను కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. బుధవారం చికిత్స పొందుతూ రాజయ్య మృతి చెందాడు. మృతుడికి భార్య రాజేశ్వరితోపాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతురాలి భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

కోరుట్ల రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగెం గ్రామానికిచెందిన గోపిడి హన్మక్క(82) అనేవృద్ధురాలు చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ చిరంజీవి బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నాలుగురోజుల క్రితం హన్మక్క గ్రామంలో తనఇంట్లో కట్టెల పొయ్యిపై వంట చేస్తుండగా అగ్ని ప్రమాదం జరిగింది. దీంతో హన్మక్కకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం ఆమె మృతిచెందింది. హన్మక్క అల్లుడు హన్మంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

చొప్పదండి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి పట్టణానికి చెందిన కటుకం శరత్ చంద్ర(39) అప్పుల బాధతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులతో కరీంనగర్ విద్యానగర్‌లో నివాసం ఉంటున్న శరత్‌చంద్ర మెడికల్ రిప్రజెంటేటీవ్‌గా పని చేస్తున్నాడు. దీంతో పాటు బట్టల దుకాణం నిర్వహిస్తున్నాడు. వ్యాపారంలో నష్టాలతో అప్పులు పెరిగిపోయాయి. హుజూరాబాద్‌లో పని ఉందని మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయల్దేరాడు. తిరిగి రాకపోవడంతో ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు ప్రయత్నించారు. స్వగ్రామం చొప్పదండిలోని ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నట్లు గుర్తించారు. శరత్ చంద్ర భార్య దివ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యం పట్టివేత

ముస్తాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేరువేరుగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నట్లు ముస్తాబాద్ ఎస్సై సీహెచ్ గణేశ్ తెలిపారు. మండలంలోని మోర్రాయిపల్లె గ్రామానికి చెందిన అకారం అరుణ్ వద్ద రూ.8వేల విలువ చేసే మద్యం, సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రాజక్కపేటకు చెందిన పాతూరి బాల్‌రెడ్డి వద్ద రూ 3వేల విలువచేసే మద్యాన్ని పట్టుకుని కేసునమోదు చేసినట్లు తెలిపారు.

వేములవాడ టౌన్ : వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వెనకాలగల కాలనీలో బొజ్జ శ్రీనివాస్ ఇంట్లో అక్రమంగా నిల్వచేసిన మద్యంను బుధవారంరాత్రి ఎస్ఐరామ్మోహన్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. పట్టుకున్న మద్యం విలువ రూ.లక్ష ఉంటుందని ఆయన తెలిపారు.

చందుర్తి: మండలం నర్సింగాపూర్‌లో బండి శ్రవణ్ కుమార్ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన మద్యంను బుధవారం రాత్రి పట్టుకున్నట్లు చందుర్తి ఎస్సై రమేష్ తెలిపారు. మొబైల్ పోలీస్ పార్టీ ఆధ్వర్యంలో 17బీర్లు పట్టుకున్నాట్లు పేర్కొన్నారు. మద్యం విలువ రూ.4000 వరకు ఉంటుందని ఆయన తెలిపారు.

- గ్రామ ఓటర్లనే నియమించుకోవాలి
- వార్డుల్లో వార్డు ఓటరే ఉండాలి
- దొంగ ఓట్లను గుర్తించేది స్థానికులే..

పోలింగ్ ఏజెంట్లే కీలకం



హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల రోజు పోలింగ్ ఏజెంటే కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుంది. గ్రామ పంచాయతీలో సర్పంచ్, వార్డుకు పోటీ చేస్తున్న ప్రతి అభ్యర్థి, ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక ఏజెంట్‌ను నియమించుకోవాలి. సదరు ఓటర్లను గుర్తించేది ఏజెంట్లే కావడంతో సర్పంచ్‌గా పోటీ చేసే ప్రతి అభ్యర్థి, వార్డు సభ్యుడిగా పోటీ చేసే అభ్యర్థి కీలకమైన వ్యక్తిని ఏజెంట్‌గా నియమించుకుంటేనే వారి గెలుపు సాధ్యమవుతుంది. సర్పంచ్ పదవికి పోటీ చేసే వ్యక్తులు ఏ వార్డు నుంచైనా వార్డు మెంబర్ అయితే ఏ వార్డు నుంచి పోటీ చేస్తున్నారో అదే వార్డుకు సంబంధించిన ఓటరును పోలింగ్ ఏజెంట్‌గా నియమించుకోవాలనే నిబంధన ఉంది. ఏదైనా కారణాల వల్ల ఇతరులను నియమించుకోవాల్సి వస్తే ముందే ఎన్నికల రిటర్నింగ్ అధికారికి రాత పూర్వకంగా తెలియజేయాలి. దానిని పరిశీలించి అనుమతి ఇస్తే తప్ప ఇతరులను నియమించుకునేందుకు వీలు లేదు.

● ఏజెంట్ల వివరాలు రిటర్నింగ్ అధికారికి పంపాలి...

సర్పంచ్ అభ్యర్థి, వార్డు సభ్యుడిగా పోటటీ చేసే వ్యక్తి స్క్రూటినీ పూర్తి కాగానే ఏజెంట్‌గా నియమించుకునే వ్యక్తి అంగీకార పత్రాన్ని రాత పూర్వకంగా డూప్లికేట్ కాపీతో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి పంపించాలి. పరిశీలన అనంతరం రిటర్నింగ్ అధికారి నియామక పత్రంపై ఆమోదం తెలుపుతూ సంత కం చేసి ఒక కాపీని ఏజెంట్‌కు అందజేస్తారు.

● కౌంటింగ్ ఏజెంట్ల నియామకం

ప్రతీ పోలింగ్ స్టేషన్‌లో మొదట వార్డుల వారీగా కౌంటింగ్ ఏజెంట్లను నియమించి కౌంటింగ్ నిర్వహిస్తారు. కౌంటింగ్ ఏజెంట్ గా వచ్చేవారు ప్రభుత్వ ఉద్యోగి, పలు రాజకీయ పదవులు చేసిన వారు అనర్హులు. వీరిని తప్ప ఎవరినైనా ఏజెంట్లుగా నియమించుకోవచ్చు.

● ఓటర్లను గుర్తించేది ఏజెంట్లే...

ప్రతి వార్డులో ఆ వార్డుకు సంబంధించిన ఓటరు వచ్చినప్పుడు ఎన్నికల సిబ్బంది ముందుగా క్రమ సంఖ్యతో పాటు అతని పేరు సరి చూసుకున్న తరువాతనే ఓటరుకు వేలుపై ఇంక్ పెట్టి బ్యాలెట్ పేపర్ అందజేస్తారు. ఓటరుకు బ్యాలెట్ పేపర్ అందించిన తర్వాత ఏజెంట్లు అభ్యంతరం వ్యక్తం చేసినా ఎన్నికల అధికారి దానిని పరిగణలోకి తీసుకోరు. ఎవరైనా ఏజెంట్ అభ్యంతరం వ్యక్తం చేస్తే ప్రిసైడింగ్ అధికారి సమక్షంలో విచారణ జరిపిన తర్వాతే ఓటు వేసే అవకాశం కల్పిస్తారు.

నోడల్ అధికారికి తీవ్ర గాయాలు


గాయపడిన నోడల్ అధికారి వినోద్‌కుమార్

వేములవాడ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): వేములవాడ మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద జడ్పీ సీఈవో, ఎన్నికల నోడల్ అధికారి వినోద్‌కుమార్ కింద పడగా తీవ్ర గాయాలపాలయ్యాడు. బుధవారం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించేందుకు వచ్చిన ఎన్నికల అబ్జర్వర్ రవికుమార్‌తోకలిసి వినోద్‌కుమార్ తిరిగి వెళుతుండగా సిమెంట్ దిబ్బకు తట్టుకొని కిందపడ్డాడు. దీంతో తలకు, చేతులకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అక్కడేఉన్న వైద్యసిబ్బంది ప్రాథమికచికిత్స అనంతరం మెరుగైనచికిత్స కోసం ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న నోడల్ అధికారి వినోద్ కుమార్‌ను జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగర్‌వాల్ పరామర్శించి చికిత్స చేస్తున్న వైద్యులను ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. దీంతో వినోద్‌కుమార్ స్థానంలో వెంటనే వేములవాడ మండల నోడల్ అధికారిగా శ్రీనివాసరావును నియమించారు.

నిబంధనలు ఉల్లంఘించిన ఒకరికి జరిమానా

పాలకుర్తి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని ఈసాలతక్కళ్లపల్లి గ్రామానికి చెందిన తీగల రాములు అనేవ్యక్తి బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించి నాటుసారా విక్రయించినందుకు పదివేల రూపాయలు జరిమానా విధించినట్లు రామగుండం ఎక్సైజ్ సీఐ మంగమ్మ బుధవారం తెలిపారు. గతంలో పాలకుర్తి తహసీల్దార్ ఎదుట హాజరుపరిచి బైండోవర్‌చేయగా, నిబంధనలు ఉల్లంఘించి నాటుసారా విక్రయించినందుకు జరిమానా విధించామన్నారు. ఎవరైనా నాటుసారా విక్రయించినా, తయారు చేసినా కఠినచర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీనివాస్ హెచ్చరించారు.

ఆలయంలో దేవతా ప్రతిమలు దగ్ధం

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట గ్రామశివారులోని మల్లికార్జునస్వామి ఆలయంలో దేవతల ప్రతిమలు బుధవారం దగ్ధమయ్యాయని స్థానికులు తెలిపారు. స్వామివారి చిత్రపటాలతోపాటు పీటలు పూర్తిగా కాలిపోయాయని పేర్కొన్నారు. ఘటనపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. దేవతలప్రతిమలు దగ్ధంపై అన్ని కోణాల్లో ఆరా తీస్తున్నామని పోలీసులు వివరించారు.

గుడిసె దగ్ధం

● రూ.20 వేల ఆస్తి నష్టం

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం కిష్టునాయక్‌తండాలోని ఒడ్డెర కాలనీలో బత్తుల దేవవ్వకు చెందిన గుడిసె బుధవారం దగ్ధమైంది. గుడిసె సమీపంలోని పొలంలో ఓ రైతు కొయ్యకాళ్లకు నిప్పు పెడుతున్న క్రమంలో మంటలు వ్యాపించాయి. గుడిసెలోని దుస్తులు, ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. బత్తుల దేవవ్వ కుటుంబ సభ్యులు మరో గుడిసెలో ఉండడం వల్ల ప్రాణాపాయం తప్పినట్లయింది. సుమారు రూ.20 వేల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితురాలు దేవవ్వ పేర్కొన్నారు.

మహిళ హత్య కేసులో నిందితుడి రిమాండ్

● వివరాలు వెల్లడించిన డీఎస్పీ రఘుచందర్


కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘుచందర్

వెల్గటూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్తంభంపల్లికి చెందిన మండలి నరేష్, నాగర్‌కర్నూలు జిల్లా మామిళ్లపల్లెకు చెందిన అతినారపు అలివేలు(38)ల మధ్య ఉన్న వివాహేతర సంబంధమే ఆమె హత్యకు దారి తీసినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. బుధవారం వెల్గటూర్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై ఉదయ్ కుమార్‌లతో కలిసి హత్యకేసు వివరాలు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం నిందితుడు మండలి నరేష్ ఉపాధి కోసం తన భార్య పిల్లలతో కలిసి హైదారాబాద్ సుచిత్రలోని ఎస్‌బీఐ కాలనీలో నివాసం ఉండేవాడు. సుమారు 5సంవత్సరాల క్రితం నిందితునికి మృతురాలు అతినారపు అలివేలుతో పరిచయం ఏర్పడింది. మృతురాలుకు ఇద్దరు కొడుకులు ఉన్నారు. కుటుంబంలోని గొడవలతో ఆమె తన భర్తతో విడాకులు తీసుకున్నది. ఈ క్రమంలో ఆమెకు నరేష్‌తో ఏప్పడిన పరిచయం ఏర్పడింది. వీరి అక్రమ సంబంధం నిందితుడి భార్యకు తెలియగా, ఆమె సుమారు 2 సంవత్సరాల క్రితం తన తల్లి తండ్రుల వద్దకు వెళ్లి పిల్లలతో కలిసి అక్కడే ఉంటున్నది. ఈ క్రమంలో మృతురాలు తన భార్యపిల్లలను వదిలి తనను పెళ్లి చేసుకోవాలని నిందితున్ని తరుచూ ఇబ్బంది పెడుతుండేది. అంతే కాకుండా నిందితుని స్వగ్రామం స్తంభంపల్లికి వెళ్లి గొడవ చేస్తుండేది. కాగా 2024లో వీరిద్దరికీ డబ్బులు అవసరం ఉండగా మంచిర్యాలలో కూస లక్ష్మి అనే మహిళను ఇద్దరు కలిసి హత్యచేసి ఆమెవద్ద ఉన్న బంగారం దొంగిలించారు. హత్య కేసును చేధించిన మంచిర్యాల పోలీసులు వారిని అరెస్ట్ చేసి ఆదిలాబాద్ జిల్లా జైలుకు తరలించారు. ఇద్దరు జైలు నుంచి మూడు నెలలక్రితం విడుదల అయ్యారు. మృతురాలు అలివేలు మంగళవారం స్తంభంపల్లి గ్రామంలోని నరేష్ ఇంటికి వచ్చి తనను పెళ్లి చేసుకోవాలని లేదంటే నాచావుకు మీరే కారణమని ఉత్తరం రాసి ఇంటి ముందు ఉన్న బావిలో దూకి చచ్చిపోతానని బెదిరించింది. దానితో నరేష్ ఎలాగైనా ఆమె అడ్డు తొలగించుకోవాలని అక్కడే ఉన్న రోకలిబండతో అలివేలు తలపై బలంగా కొట్టగా అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం నిందితుడు వెల్గటూర్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. ఎస్సై ఉదయ్ కుమార్ కేసు నమోదు చేయగా, ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి కేసును దర్యాప్తు చేపట్టారు. నిందితుడు మండలి నరేష్‌ను ధర్మపురి ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచి రిమాండ్‌కు తరలించారు.

ఢిల్లీలో బీసీ సంక్షేమ సంఘం నాయకుల నిరసన

గణేశ్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే డిమాండ్‌తో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బుధవారం తెలంగాణ బీసీ సంక్షేమసంఘం రాష్ట్రఅధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ బీసీ సంక్షేమసంఘం రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లం లింగమూర్తి మాట్లాడుతూ దేశ జనాభాలో సుమారు 63శాతం బీసీలు ఉన్నా నిర్లక్ష్యానికి గురవుతున్నారన్నారు. బీసీలకు42శాతం రిజర్వేషన్లను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో బ్యాక్‌లాగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, ఈ బీసీ విద్యార్థులకు ఉన్నత విద్యలో 50శాతం రిజర్వేషన్ అమలు చేయాలని అన్నారు. బీసీలకు సంబంధించిన సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేశం, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


న్యూఢిల్లీ జంతర్మంతర్‌లో నిరసన తెలుపుతున్న తెలంగాణ బీసీ నాయకులు

ప్రజా బాంధవుడిని కోల్పోయాం

● మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి
● సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సమద్ నవాబ్ అంత్యక్రియలు


ఆవాల సరోజకు నివాళులర్పిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మాజీఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, సుడాచైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పేదముస్లింల పక్షపాతిని, ప్రజాబాంధవుడిని సమాజం కోల్పోయిందని మంత్రి శ్రీధర్‌బాబు, మాజీఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ఇదారా ఏ ఖాదిమానే మిల్లత్ సెక్రెటరీ అబ్దుల్ సమద్ నవాబ్ అంత్యక్రియలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమద్ నవాబ్ మరణం కాంగ్రెస్‌పార్టీకి తీరని లోటన్నారు. పేదల అభిమానాన్ని చూరగొన్న నేతగా, సంఘ సంస్కర్తగా సమద్ నవాబ్ చరిత్ర పుటల్లో నిలిచిపోతారన్నారు. కాంగ్రెస్ సమద్ నవాబ్ కుటుంబానికి అండగా ఉంటుందన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఇటీవల మరణించిన కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు ఆవాల సరోజ కుటుంబాన్ని పరామర్శించారు. సుడాచైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

స్వగ్రామం చేరిన మృతదేహం

ధర్మపురి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జీవనోపాధి నిమిత్తం ఇరాక్ దేశానికి వెళ్లి ప్రమాదవశాత్తు మూడు నెలల క్రితం మృతి చెందిన గుర్రం సురేష్ మృతదేహం బుధవారం నేరెళ్ల స్వగ్రామానికి చేరుకుంది. ధర్మపురి మండలంలోని నేరెళ్ల గ్రామానికి చెందిన గుర్రం సురేష్ జీవనోపాధి నిమిత్తం ఇరాక్ దేశానికి వెళ్లాడు. ఇరాక్‌లోని హేవ కంపెనీలో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు సెప్టెంబరు 3న మృతిచెందాడు. మూడునెలల తరువాత మృతదేహం స్వగ్రామానికి చేరుకోగా శవపేటికపై పడి కుటుంబసభ్యులు బోరున విలపించారు. దహన సంస్కారాలు నిర్వహించారు. మృతునికి భార్య, ఇద్దరు కూతురులు, తల్లి ఉంది. మృతదేహం రావటానికి ఎంబసీ అధికారులు, రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, తెలంగాణ రాష్ట్రప్రభుత్వ అధికారులు, ఎన్నారై అధికారులు సహకరించారు. ఇందుకోసం సహకారం అందించిన మంత్రి, అధికారులకు బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు, మండల కాంగ్రెస్ అధికార ప్రతినిధి, న్యాయవాది జాజాల రమేష్ తెలిపారు.

అన్నపూర్ణకాలనీలో వీధికుక్కల స్వైర విహారం

● గంట వ్యవధిలోనే ఐదుగురిపై దాడి


కుక్కకాటుకు గురైన చిన్నారి

జ్యోతినగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ అన్నపూర్ణ కాలనీలో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. బుధవారం గంట వ్యవధిలోనే ఐదుగురిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. కుక్కల దాడిలో ఈదునూరి బానేష్, ఈదునూరి భాగ్య, గోషిక దుర్గమ్మ, పెగడపల్లి రుద్ర, నర్మదకు గాయాలయ్యాయి. కొంతకాలంగా అన్నపూర్ణకాలనీలో వీధికుక్కల బెడద ఎక్కువైందని, మున్సిపల్‌అధికారులకు ఎన్నిమార్లు తెలిపినా పట్టించుకోవడం లేదని సీపీఎం నాయకులు రామాచారి, గీట్ల లక్ష్మారెడ్డి ఆరోపించారు. తక్షణమే మున్సిపల్ సిబ్బంది స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అన్నపూర కాలనీలో పిచ్చికుక్కల బారి నుంచి ప్రజలను రక్షించాలని వారు రామగుండం మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌ను కోరారు.

ప్రమాదకరంగా డివైడర్లు..

● తరచూ రోడ్డు ప్రమాదాలు ● సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్


కోరుట్ల బస్టాండులో ప్రమాదకరంగా ఉన్న డివైడర్



రోడ్డు ఇరుకుగా ఉండడంతో డిసెంబరు 2న డివైడర్‌ను ఢీకొట్టిన కారు

వేములవాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండు సమీపం నుంచి తెలంగాణ చౌక్ వరకు ఉన్న డివైడర్‌లు ప్రమాదకరంగా మారాయి. చందుర్తి, మల్లారం నుంచి పట్టణంలోకి వచ్చే వాహనాదారులకు స్వాగతం పలికే కమాన్ సమీపంలో డివైడర్ ప్రారంభం అవుతుంది. డివైడర్ ప్రారంభంలో ఎలాంటి సూచిక బోర్డులను అధికారులు ఏర్పాటు చేయలేదు. దీంతో డివైడర్ ఉందని వాహనదారులకు కనిపించకపోవడంతో డివైడర్‌ను ఢీకొంటున్నారు. వాహనదారులు ఇబ్బందుల ఎదుర్కొంటున్నారని, సంబంధిత అధికారులు వెంటనే చీకట్లో వాహనదారులకు కనిపించేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని పట్టణ వాసులు, స్థానిక వ్యాపారులు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

నిత్యం రోడ్డు సంఘటనలు..

వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండు సమీపంలోని డివైడర్ ప్రారంభం వద్ద ప్రతినిత్యం వాహనాలు డివైడర్‌ను ఢీకొంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. వేగంగా వచ్చే వాహనాలకు డివైడర్ కనిపించకపోవడంతో వేగంగా డివైడర్‌ను ఢీకొడుతున్నారని దీంతో ప్రమాదాల బారిన పడుతున్నారని చెబుతున్నారు. రోడ్డుపైన ఏర్పాటు చేసిన డివైడర్‌లు సైతం పక్కకు జరిగి ప్రమాదకరంగా మారినా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైన సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి..

- అక్కనపల్లి వివేకొరెడ్డి, వేములవాడ



కోరుట్ల బస్టాండు నుంచి తెలంగాణ చౌక్ వరకు ప్రమాదకరంగా డివైడర్‌లు ఉన్నాయి. రోజు ఒక సంఘటన జరుగుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సూచిక బోర్డులు వాహనదారులకు కనిపించేలా ఏర్పాటు చేయాలి.

పార్వతీపురంలో నాగుపాము కలకలం


పామును పట్టుకున్న స్నేక్ క్యాచర్ జగదీశ్

వేములవాడ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న వసతిగదులైన పార్వతీపురం వద్ద బుధవారం భారీ నాగుపాము ప్రత్యక్షమై కలకలం సృష్టించింది. కొంతకాలంగా వినియోగంలో లేని వసతి గదిని తిరిగి వినియోగంలోకి తెచ్చేందుకు అందులో వస్తువులను తొలగిస్తుండగా ఐదు అడుగుల నాగుపాము ప్రత్యక్షమైంది. వెంటనే ఆలయ పర్యవేక్షకులు శ్రీకాంత్‌శర్మ, సీనియర్ అసిస్టెంట్ ఎడ్లశివ స్నేక్‌క్యాచర్ జగదీష్‌కు సమాచారం అందించడంతో ఆయన చేరుకొని నాగుపామును పట్టుకొని బయట వదిలేశాడు.

చివరి మజిలీకి తప్పని తిప్పలు

● బ్యాక్ వాటర్‌లోనే అంత్యక్రియలు

వేములవాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలో చివరి మజిలీకి సైతం తిప్పలు తప్పడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రుద్రవరం గ్రామానికి చెందిన ముదం నర్సయ్య అనే వృద్ధుడు మంగళవారం అనారోగ్యంతో మృతిచెందాడు. రుద్రవరం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నిర్మించిన శ్మశాన వాటికలోకి మిడ్‌మానేరు బ్యాక్‌వాటర్ చేరడంతో అంత్యక్రియలు చేసేందుకు గ్రామస్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. నర్సయ్య మృతదేహంతో నీటిలోనే అంత్యక్రియలు నిర్వహించిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి రాగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.


రుద్రవరంలో నీటిలోనే అంత్యక్రియలు చేస్తున్న గ్రామస్థులు

ఏపీపీ రాత పరీక్షను వాయిదా వేయాలి

హుజూరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అసిస్టెంట్ పబ్లిక్‌ప్రాసిక్యూటర్ (ఏపీపీ) రాతపరీక్షను వాయిదా వేయాలని తెలంగాణ జనసమితి రాష్ట్రప్రధాన కార్యదర్శి, ప్రముఖ న్యాయవాది ముక్కెరరాజు కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈనెల14న ఏపీపీ రాత పరీక్షరోజున రాష్ట్రవ్యాప్తంగా ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికలు ఉన్నాయని, అదేరోజు ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం ఒంటిగంట, తిరిగి మధ్యాహ్న 2:30నుంచి సాయంత్రం 5:30గంటల వరకు తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు ఏపీపీ రాత పరీక్షలను నిర్వహిస్తోందన్నారు. ఏపీపీ రాత పరీక్షకేవలం హైదరాబాద్‌లోనే నిర్వహిస్తుండడంతో గ్రామీణప్రాంత న్యాయవాదులు ఓటుహక్కును వినియోగించుకునే అవకాశాన్ని కోల్పోతున్నారన్నారు. ఓటు అనేది భారత రాజ్యాంగం కల్పించినహక్కు అని,సద్వినియోగం చేసుకునేందుకు బోర్డుపునరాలోచన చేయాలని కోరారు.

బైండోవర్

మల్యాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీఎన్నికల నేపథ్యంలో మండలంలోని 24మంది బెల్ట్‌దుకాణాల నిర్వాహకులను బైండోవర్‌చేశారు. మద్యం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పేర్కొంటూ ఎక్సైజ్ అధికారులు వివిధ గ్రామాలకు చెందిన వ్యక్తులను తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు.

ఓటుకే ప్రాధాన్యం

- నిబంధనలు పాటిస్తేనే మేలు
- ఓటు హక్కు వినియోగానికి ఈసీ ఏర్పాట్లు



జగిత్యాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటుకే ప్రాధాన్యం దక్కుతుంది. ఓటు హక్కు వినియోగానికి ఎన్నికల సంఘం అమలు చేస్తున్న నిబంధనలను పాటిస్తేనే ప్రయోజనం చేకూరుతుంది. అర్హులందరూ ఓటు వేసేలా ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఓటు సాధారణంగా అందరికీ ఒకేలా ఉంటుంది. కానీ అదే ఓటును కొన్ని సమయాల్లో వేరే పేరుతో పిలుస్తారు. ఈ నెల 11వ తేదీన జిల్లాలో తొలి విడత పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి.

● జాబితాలో పేరు లేకుంటే..

ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకోవాలంటే ఓటరు జాబితాలో తప్పనిసరిగా పేరు ఉండాల్సిందే. ఒకవేళ పేరు లేకుం టే ఓటు హక్కు వినియోగానికి అనర్హుడు. ఓటరు తన ఓటు ఏ పోలింగ్ బూత్‌లో ఉందనేది అందుబాటులో ఉండే బీఎల్‌వోల ద్వారా తెలుసుకోవాలి.

● వీరికే అనుమతి

పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, వారి ఏజెంట్‌లకు అవకాశం ఉంటుంది. ఓటరు తో పాటు పసిపిల్లలకు అవకాశం ఉంది. పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్స్, సెక్టోరల్ అధికారులు, ఈసీఐ ద్వారా అనుమతి పొందిన విలేకరులు, ఈసీఐ ద్వారా అనుమతి పొందిన ఇతరులు పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు అవకాశం ఉంటుంది.

● టెండర్ ఓటుకు అవకాశం

ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వెళ్లిన వ్యక్తి అప్పటికే వేరే వ్యక్తి తన ఓటును వినియోగించుకున్నాడని తెలిస్తే సదరు ఓటరు ఎన్నికల నిబంధనల మేరకు 49-ఏ ప్రకారం టెండర్ ఓటేసే అవకాశం ఉంటుంది. దీనికి సంబంధించిన ప్రక్రియ పీఓ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఏపీఓ, అభ్యర్థుల పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో ఓటరు జాబితాను చెక్ చేసుకుంటారు. ఇప్పుడున్న పరిస్థితిలో దొంగ ఓట్లు వేసే అవకాశం లేదు. జిల్లాలో ఎక్కడా టెండర్ ఓటు నమోదు కాదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

● నిబంధనలు పాటించాల్సిందే..

ఓటు హక్కును వినియోగించుకునేవారు తప్పనిసరిగా ఎన్ని కల నిబంధనలు పాటించాలి. పోలింగ్ కేంద్రాల వద్ద అభ్యర్థుల గుర్తులు, కండువాలు, వస్త్రాలను ధరించవద్దు. సెల్‌ఫోన్లను తమ వెంట తీసుకెళ్లకూడదు. ఓటరు పోలింగ్ కేంద్రాలకు వెళ్లేటప్పుడు భద్రత సిబ్బందికి సహకరించాలి. ఓటు హక్కు వినియోగానికి పోల్ స్లిప్ ప్రామాణికం కాదు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు 16 ధ్రువపత్రాలలో ఏదైనాఒకటి తీసుకెళ్తే ఓటువేసేందుకు అవకాశం ఉంది.

● సందేహాలు ఉంటే పీఓకు ఫిర్యాదు చేయాలి

ఓటరుకు ఏమైనా అనుమానాలు సందేహాలు ఉంటే ప్రిసైడింగ్ అధికారి (పీఓ)కు ఫిర్యాదు చేయవచ్చు. ఈ విధానాన్ని పీఓ పర్య వేక్షించి రెండు గంటలకొకసారి నమోదైన పోలింగ్ వివరాలను సెక్టోరియల్ ఆఫీసర్‌కు సమాచారం అందిస్తారు.

ఆచార వ్యవహారాలను కాపాడుకోవాలి



ఎస్‌యూలో ఎత్నిక్ డేలో పాల్గొన్న ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మన ఆచార వ్యవహారాలను కాపాడుకోవాలని సంస్కృతీ సంప్రదాయాలే మూల స్తంభాలని ఎస్‌యూ వీసీ ఉమేష్‌కూమార్ అన్నారు. బుధవారం యూనివర్సిటీ కామర్స్ కళాశాలలో ఎత్నిక్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయ వాణిజ్య, వ్యాపార కళాశాల ఏటా కార్యక్రమం నిర్వ హిస్తున్నట్లు చెప్పారు. జాతి గౌరవాన్ని పెంపొందించే ఆచారాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అంతకుముందు వీసీ ఉట్టి కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్, వాణిజ్య కళాశాల ప్రిన్సిపాల్, డాక్టర్ హరికాంత్, పరీక్షల నియంత్రణ అధికారి సురేష్‌కుమార్, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ రమాకాంత్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సూరేపల్లి సుజాత, అధ్యాపకులు పాల్గొన్నారు.

రూ.7400 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.7400 పలికింది. బుధవారం మార్కెట్‌యార్డుకు 62మంది 446క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకొచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7400, కనిష్ఠ ధర రూ.6900 చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు. పత్తి కొనుగోళ్లను మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శి రాజు పర్యవేక్షించారు.

రహదారి ఆక్రమణపై రైతుల రాస్తారోకో



గ్రామస్థులతో చర్చిస్తున్న పోలీసులు

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెల్లుల్ల రోడ్డు నుంచి వ్యవసాయ పనులు, మల్లెతోటలకు వెళ్లే రహదారి ఆక్రమించారని పేర్కొంటూ బుధవారం రైతులు రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. దీనిపై స్పందించిన పోలీసులు అక్కడికి వచ్చి ఎన్నికల అనంతరం దీనిపై చర్చించుకుందామని వారిని సముదాయించి హామీ ఇవ్వడంతో రైతు నిరసన విరమించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మల్లెతోటకు వ్యవసాయ పనులకు దారి ఉండేదని, దానిని కబ్జా చేయడంతో సుమారుగా 300మంది రైతు కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని వారు పేర్కొన్నారు. ఇటీవల అక్రమంగా లింకు రోడ్డు కబ్జాకు గురైందని, ప్రవాహం లేని ఎస్సారెస్పీ డీ32ను రోడ్డుగా అభివృద్ధిచేయాలని, సైనో1094లో గల మేఘనా వెంచర్‌లోని 40 ఫీట్ల రోడ్డు నుంచి మల్లెతోట వరకు రోడ్డు అభివృద్ధి చేసి తమకు రవాణా సౌకర్యం కల్పించాలని వారు కోరారు. దీనిపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఆక్రమించిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ సంగు గంగాధర్, మాజీ వైస్‌చైర్మన్ చంద్రశేఖర్‌రావు, సంఘం అధ్యక్షుడు పూదరి సుధాకర్ గౌడ్, అరిసెల రమేష్, బొడ్ల సాగర్, రామకృష్ణ, ఆకుల ప్రవీణ్, రవి, అంజయ్య గాజా రాజారెడ్డి, రాహుల్, సంగు ప్రతిప్, అంజాగౌడ్, గంగాధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన మిషన్ భగీరథ పనులు

వేములవాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండు నుంచి తెలంగాణ చౌక్ వరకు రోడ్డుకు ఇరువైపుల ఉన్న ఇండ్లల్లోని ప్రజలకు మిషన్ భగీరథ నీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మరమ్మతులో భాగంగా కాంట్రాక్టరు రోడ్డుకు ఇరువైపుల ఎక్సకవేటర్ సహాయంతో మట్టిని తొలగించారు. దీంతో రోడ్డు పక్క నుంచి ఇండ్లల్లోకి వెళ్లే మిషన్ భగీరథ పైపులు తెగిపోయాయి. రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమై సువరుగా 15 రోజులు అవుతున్న పనులు నిలిచిపోయాయి. దీంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇంటి యజమానులు, వ్యాపారులకు మిషన్ భగీరథ నీరు అందక, రోడ్డు తవ్వి వదిలేయడంతో ఇంట్లోకి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొంటున్నారు.

రాష్ట్రస్థాయి క్రీడల్లో గురుకుల బాలికల సత్తా



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సుచిత్ర

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ అండర్ 17,19విభాగాల్లో రాష్ట్రస్థాయి పుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ పోటీల్లో జగిత్యాల జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థినులు ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ సుచిత్ర తెలిపారు. పుట్‌బాల్ బీచ్ వాలీబాల్‌లో 10వతరగతి విద్యార్థి అమీనా, అండర్-19 విభాగంలో కో-కో పోటీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న స్ఫూర్తి, అసోసియేషన్ కబడ్డీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువు తున్న షబానా ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ఆమె తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ సుచిత్ర. పీడీ శ్రీవిద్య, పీఈటీ రమాదేవితో పాటు ఉపాధ్యాయులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

నాగాయపల్లి గ్రామస్థులకు నీటి తిప్పలు

- మిషన్ భగీరథ నీరు రాక ప్రజల కష్టాలు



వాటర్ ట్యాంకర్‌తో నీటిని నింపుకుంటున్న గ్రామస్థులు

వేములవాడ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ నీరు రాక నాగాయపల్లి గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాగాయపల్లి గ్రామంలో కొన్నిరోజులుగా మిషన్ భగీరథనీరు అందక ప్రజలు నీటితిప్పలు ఎదుర్కొంటున్నారు. తాగునీటికి, ఇంటి అవసరాలకు వాటర్ ట్యాంకుల పైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొందని గ్రామస్థులు వాపోతున్నారు. పంటపొలాల్లో ఉన్న బోర్ల ద్వారా నీటిని తెచ్చుకొని అవసరాలకు వినియోగించుకుంటున్నట్లు గ్రామస్థులు తెలిపారు. మిషన్ భగీరథ నీరు అందకుండా నీటికి కష్టాలు ఎదుర్కొంటున్నప్పటికి అధికారులు స్పందించడం లేదని, గ్రామంలో ఉన్న 3 బోరుబావులు నిరుపయోగంగా ఉన్నాయని వాటని సైతం పట్టించుకునే నాథుడే లేడని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్యవిధాన పరిషత్‌ను తక్షణమే రద్దు చేయాలి



సూపరింటెండెంట్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న టీజీఎంఈయూ సభ్యులు

హుజూరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైద్య విధాన పరిషత్‌ను తక్షణమే రద్దు చేయాలని, దాని స్థానంలో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌సర్వీసెస్‌ను ఏర్పాటుచేయాలని ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బుధవారం యూనియన్ నాయకులు హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలోని ఉద్యోగులు సామూహికంగా సంతకాల సేకరణ చేపట్టి ఆస్పత్రి సూపరింటెండెంట్ నారాయణరెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు స్వాతి మాట్లాడుతూ 1986లో ఏర్పాటైన వైద్య విధాన పరిషత్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించకపోవడం, వేతన సవరణ సంఘానికి (పీఆర్సీ) వినతులు సమర్పించే అవకాశం లేకపోవడం, ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించకపోవడం వంటి కారణాలతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సులోచన, సునీత, శోభ, జమున, జ్యోతి, స్నేహ, సుజాత, మమత, శాంతికళ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలి

హుజూరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వాణిజ్య పన్నులశాఖలో పనిచేస్తున్న ఏసీటీవోలకు డీసీటీవోగా పదోన్నతులు కల్పించాలని తెలంగాణ వాణిజ్య పన్నులశాఖ నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ కోరారు. బుధవారం తెలంగాణ వాణిజ్యపన్నులశాఖ రాష్ట్రకమిషనర్ రఘునందన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఖాళీగాఉన్న డీసీటీవోపోస్టుల్లో ఏసీటీవోలకు ప్రమోషన్లు ఇస్తే రాష్ట్రప్రభుత్వ ఖజానాకు ప్రొఫెషనల్‌టాక్స్ రావడానికి అవకాశం ఉందన్నారు.

ఉత్తమ సేవలకు అవార్డులు



అవార్డును అందుకుంటున్న పున్నం చందర్

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి చెందిన పలువురి ఉత్తమ సేవలకు అవార్డులు వచ్చాయి. బుధవారం హైదరాబాద్ తెలంగాణ సారస్వత పరిషత్‌లో సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో డాక్టర్ ఏపీజె అబ్దుల్‌కలాం గ్లోబల్ ఐకాన్ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. రాజన్నసిరిసిల్ల జిల్లాలో గత 15సంవత్సరాలుగా సైకాలజిస్ట్‌గా ప్రజలకు, కార్మికులకు విశేషసేవలు అందిస్తున్న సైకాలజిస్ట్ కనుకుంట్ల పున్నంచందర్ బెస్ట్‌సర్వీస్‌అండ్ సైకాలజిస్ట్ అవార్డుకు ఎంపికయ్యాడు. అదేవిధంగా హెల్పింగ్ హార్ట్ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ద్వారా ప్రజలకు విశిష్ట సేవలను అందిస్తున్న అల్వాల ఈశ్వర్, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా వైస్ చైర్మన్ గడ్డం దివాకర్ ఉత్తమ సామాజిక సేవ అవార్డులకు ఎంపికయ్యారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిలర్ జాతీయ అధ్యక్షుడు కొప్పుల విజయ్‌కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ హనుమాగౌడ్, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కన్వీనర్ గాజుల వేణుకుమార్, రాష్ట్ర ఉమెన్ వింగ్ డైరెక్టర్ గజ్జెల కరుణ అవార్డులను ప్రదానం చేసి అభినందించారు.

'నవోదయ' ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

చొప్పదండి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో ఈ నెల 13న నిర్వహించే నవోదయ 6వ తరగతి ప్రవేశపరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 34పరీక్షకేంద్రాలను ఏర్పాటు చేశామని, విద్యార్థులు అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఇబ్బందులు ఉంటే తమను సంప్రదించాలని తెలిపారు.

భవిష్యత్ తరాలకు బాటలు వేస్తున్న సీఎం: చాడ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి

చిగురుమామిడి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాలకు బాటలు వేసే ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి నిలిచిపోతారని, విద్య, వైద్యం ఉపాధి అవకాశాలపై విజన్ ఉందని సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని పార్టీ కార్యాలయంలో బుధవారంవిలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి జరగాలంటే వనరులన్నింటినీ ఉపయోగించుకోవాలన్నారు. తెలంగాణలో మొదటి నుంచి భూ సమస్య ఉందన్నారు. రైజింగ్ తెలంగాణ 2047గ్లోబల్ సమ్మెట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అన్ని విషయాలను పొందుపరిచారని, జల్ జంగల్ జమీన్ కొమరంభీం ప్రస్తావన చేయడం, భూమి కోసం భుక్తి కోసం విముక్తికోసం జరిగిన పోరాటంలో వేలాదిమంది అమరత్వం పొందినట్లు చెప్పారన్నారు. ఏ ముఖ్యమంత్రి కూడా ఇలా మాట్లాడ లేదని, సామాజిక అంశాలపై లోతుగా అధ్యయనం చేశారని అన్నారు. విద్య వైద్యంపై సంపూర్ణ అవగాహన కలిగి భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలిచేందుకు గ్లోబల్ సమ్మిట్ ఉండాలని ముందు చూపుతో వ్యవహరించిన సీఎంను అభినందిస్తున్నామని అన్నారు. స్థానికసంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్రం నుంచి నిధులు విడుదల కాలేదని, దాదాపుగా 4వేల కోట్ల రూపాయలు రావాల్సి ఉందని అన్నారు. కొంత ఆలస్యంగానైనా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికలు నిర్వహిస్తోందన్నారు. ఎన్నికల్లో సీపీఐ మద్దతుదారులను గెలిపించాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అందె స్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్,గూడెం లక్ష్మి, జిల్లా కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వ్యవసాయ బావి



శ్రీనివాస్‌నగర్-జగ్గయ్యపల్లి మధ్య రోడ్డు పక్కన ఉన్న బావి

మానకొండూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మానకొండూర్ మండలం శ్రీనివాస్‌నగర్-జగ్గయ్యపల్లి గ్రామాలమధ్య రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ బావి ప్రమాదకరంగా మారింది. మానకొండూర్-వేగురుపల్లి ప్రధాన రహదారిపై మూల మలుపు ఉండడమే కాకుండా రోడ్డును ఆనుకొని వ్యవసాయ బావి ఉంది. ఈ రహదారి వెంట వేగురుపల్లి, లక్ష్మీపూర్, వెల్ది, లింగాపూర్, జగ్గయ్యపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు, కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, ఉద్యోగులు నిత్యం ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఆర్టీసీ బస్సుల్లో కరీంనగర్‌కు వెళ్తారు. వందలాది ఇసుక ట్రాక్టర్లు ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు నడుస్తూనే ఉంటాయి. బావి వద్ద పెద్ద వాహనాలు ఎదురుగా వస్తున్న సమయంలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని ప్రమాదాలను నివారించడానికి సూచికలు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

సమ్మక్క భక్తులకు ఏర్పాట్లు వేగవంతం చేయాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ఏర్పాట్లపై సిబ్బందితో మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ భీమేశ్వరాలయానికి వచ్చే సమ్మక, సారలక్క జాతర సందర్భంగా వచ్చే భక్తులకు తగిన ఏర్పాట్లు వేగవంతం చేయాలని ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం వేములవాడ భీమన్న ఆలయంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఆలయ అధికారులతో కలిసి విప్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో రద్దీ పెరిగినందున అవసరమైన ఏర్పాట్లు వెంటనే పూర్తిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. అనంతరం ఉచిత దర్శనం, కోడెల క్యూలైన్, కళ్యాణ కట్ట, విఐపి రోడ్డు, తదితర క్యూలైన్‌లను పరిశీలించారు. ప్రధానంగా తాగునీటి సదుపాయం, సైన్‌బోర్డులు, పరిశుభ్రమైన మరుగుదోడ్లు, మూత్ర శాలలు, స్నానాల గదులు, లైటింగ్ సదుపాయాలు, ఫ్యాన్లు, సీసీకెమెరాలు, డిజైన్స్ సదుపాయాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. సమ్మక్క జాతర సందర్భంగా వేములవాడకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయి సన్నాహాలు చేయాలని అధికారులను ఆదేశించారు.

బాలకిషన్‌నే అనంతగిరి సర్పంచ్‌గా గెలిపించుకుంటాం



అనంతగిరి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బాలకిషన్

ఇల్లంతకుంట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : గ్రామంలోని సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉన్న బుర్ర బాలకిషన్‌నే సర్పంచ్‌గా ఎన్నుకుంటామని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసర్పంచ్‌గా పోటీచేస్తున్న బాలకిషన్ తనకు కేటాయించిన లేడిబ్యాగ్(పర్స్) గుర్తుతో అన్నివర్గాల ప్రజలతో కలిసి బుధవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. ముంపు సమయంలో యువతకు రావలసిన ప్యాకేజీలు, కాలనీ సమస్యలు, కోర్టు సమస్యల గురించి బాలకిషన్‌కు అవగాహన ఉందన్నారు. గతంలో ఉపసర్పంచ్‌గా పనిచేసిన అనుభవం ఉండటం వల్ల ఈసారి సర్పంచ్ అయితే గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. కాలనీలో డ్రైనేజీ, సీసీరోడ్ల నిర్మాణాలు, ఇతర గ్రామాలకు అనుసందానంగా ఉన్న రోడ్ల నిర్మాణాలు పూర్తిచేస్తాడని గ్రామస్థులు నమ్మి కులసంఘాలు మద్దతు ప్రకటించాయని పేర్కొన్నారు. బాలకిషన్ మాట్లాడుతూ ప్రజలు ఆశీర్వదిస్తే అనంతగిరి గ్రామాన్ని ఆదర్శగా మార్చేందుకు కృషి చేస్తానని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటానని పేర్కొన్నారు. గ్రామంలోని అత్యధిక మంది స్వచ్ఛందంగా వచ్చి ప్రచారంలో పాల్గొంటున్నారు. బాలకిషన్ ఇస్తున్న హామీలను పూర్తిగా నమ్మిన యువకులు, మహిళలు లేడిబ్యాగ్ (పర్సు) గుర్తుకు ఓటువేయడానికి సిద్ధం అవుతున్నారు.

అభ్యర్థుల ఖర్చులపై ప్రత్యేక దృష్టి

- జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు రాజ్‌కుమార్



సూచనలు చేస్తున్న వ్యయ పరిశీలకుడు రాజ్‌కుమార్

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు రాజ్‌కుమార్ ఆదేశించారు. వీర్నపల్లి మండల పరిషత్తు కార్యాలయాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. మండలంలో నిర్వహిస్తున్న ఎన్నికల ప్రక్రియ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల వ్యయాలను అభ్యర్థుల నుంచి రోజు వారిగా స్వీకరించాలని అన్నారు. పలు సూచనలు చేశారు. ఆయన వెంట నోడల్ అధికారులు నవీన్, భారతి, ఎంపీడీవో శ్రీలేఖ, తదితరులు ఉన్నారు.

ఎన్నికల నిబంధనలను పాటించాలి

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు విధిగా ఎన్నికల నిబంధనలను పాటించాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్‌బేగం అన్నారు. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లోని బొప్పాపూర్, వీర్నపల్లి గ్రామాల రైతు వేదికల్లో అభ్యర్థులకు ఎన్నికల నియమావళిపై బుధవారం అవగాహన కల్పించారు. బొప్పాపూర్‌లో జరిగిన సమావేశానికి మండల ప్రత్యేక అధికారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి హాజరై మాట్లాడారు. సమావేశంలో ఎంపీడీవోలు సత్తయ్య, శ్రీలేఖ, తహసీల్దార్లు సుజాత, ముక్తార్‌పాషా, ఎంపీవోలు రాజు, బీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని ఉల్లంఘించవద్దు

ముస్తాబాద్ : ఎన్నికల నియమావళిని ఉల్లంఘించవద్దని వ్యయ పరిశీలకులు రామచంద్రుడు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో సర్పంచ్ అభ్యర్థులుగా, వార్డ్ మెంబర్ అభ్యర్థులకు బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి రోజు ఎన్నికల ఖర్చును తెలుపాలని కోరారు. ఒకవేళ తప్పుడు సమాచారం కానీ, ఎన్నికల ఖర్చును కానీ ఇవ్వని పక్షంలో విచారణ జరిగితే అభ్యర్థి ఎన్నికను రద్దు చేసే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి లచ్చాలు, అభ్యర్థులు పాల్గొన్నారు.

ప్రచారంలో దూసుకుపోతున్న భైరి రమేష్..



ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్ అభ్యర్థి భైరి రమేష్

తంగళ్లపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీ గ్రామం సర్పంచ్ అభ్యర్థి భైరి రమేష్ ప్రచారంలో దూసుకు పోతున్నాడు. గడప గడపకూ తిరుగుతూ కత్తెర గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నాడు. మహిళలు, అన్ని వర్గాల ప్రజలు భైరి రమేష్‌ను ఆదరిస్తున్నారు. ఇందిరమ్మకాలనీ గ్రామం, కేసీఆర్ నగర్ ప్రజల చూపు సర్పంచ్ అభ్యర్థి భైరి రమేష్ వైపు ఉంది. ఈ సందర్భంగా మాట్లాడుతూ భైరి రమేష్ కేసీఆర్ నగర్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక తయారు చేసినట్లు తెలిపారు. గెలుపొందగానే అమలు చేస్తానని అన్నారు. అలాగే గ్రామంలో మిగిలి పోయిన అభివృద్ధి పనుల చేస్తానని తెలిపారు. ఆడపిల్ల పుడితే రూ 5వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తానని, ఆడపిల్ల పెళ్లికి రూ 5వేలు నగదు అందజేస్తానని అన్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఓ వ్యక్తి.. తన ఎన్నికల ప్రచార ఫ్లెక్సీలను, మెనిఫెస్టో ఫ్లెక్సీ చింపివేయడాన్ని తప్పు పట్టారు. తన గెలుపు ఖాయమయిందని అది జీర్ణించుకోలేక ఫ్లెక్సీలను చింపి వేయడం, గూండాగిరి పనులు చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఇటువంటి సంఘటనలకు భయపడేది లేదని, ప్రజల మద్దతు తనకు ఉందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు తన బ్యాలెట్ నంబరు 2 కత్తెర గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

నేడే తొలి తీర్పు..

(5వ పేజీ తరువాయి)

బందోబస్తును ఏర్పాటు చేశారు. మూడో విడతలో ఐదు మండలాల్లోని 76 గ్రామాల్లో 700 మంది పోలీస్ సిబ్బందిని ఎన్నికల నిర్వహణకు ఉపయోగిస్తున్నారు. జిల్లా ఎస్పీ మహేష్ బీ గీతే పర్యవేక్షణలో అదనపు ఎస్పీ, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో పాటు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. 25 రూట్లలో మొబైయిల్ బృందాలు, ఏడు జోనల్ బృందాలు, ఐదు క్విక్ రియాక్షన్ బృందాలు, రెండు స్త్రైకింగ్ ఫోర్స్‌లను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక దృష్టిపెట్టారు. ఇప్పటికే 14 సమస్యాత్మక, 13 సున్నితమైన గ్రామాలుగా గుర్తించి ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశారు.

వైన్స్‌లపై చర్యలు తీసుకోవాలి

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలో ప్రతి వార్డుల్లో కిరాణ దుకాణాలతో పాటు అనుమతులు లేకుండా ఏర్పాటుచేసిన మద్యం బెల్ట్ షాపులపై ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని ఇప్పటికైనా వాటిపై చర్యలు తీసుకోవాలని ఏఐఎఫ్‌టీయూ న్యూ రాష్ట్ర కమిటీ సభ్యుడు సోమిశెట్టి దశరథం, జిల్లా కన్వీనర్ మచ్చ అనసూర్యలు డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో బుధవారం సీఐ శ్రీనివాస్‌ను ఏఐఎఫ్‌టీయూ న్యూ నాయకులు కలిసి వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో పంతం సుజాత, గడదాస్ లతారాజేశం, దేవదాస్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా రమణ, పద్మ

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి ఇద్దరిని ఎన్నుకున్నారు. మెదక్ జిల్లా కేంద్రంలో మూడురోజుల పాటు జరిగిన సీఐటీయూ రాష్ట్ర 5వ మహాసభలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణతో పాటు సీఐటీయూ బీడీ వర్కర్స్ యూనియన్ నుంచి సూరం పద్మలను ఎన్నుకున్నారు. బుధవారం సిరిసిల్లలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం అశోక్, గీస బిక్షపతి, ఎలిగేటి రాజశేఖర్, దాసరి రూప వారిని అభినందించారు.

పలువురికి కేటీఆర్ పరామర్శ

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వైద్యుడు సత్యనారాయణస్వామితో పాటు గంభీరావుపేట మండలం దమ్మన్నపేట మాజీ ఎంపీటీసీ సభ్యుడు అంబర్‌నాయక్‌లను స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో బుధవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పరామర్శించారు. వైద్యుడు సత్యనారాయణస్వామి తల్లి ఇటీవల మృతిచెందగా కేటీఆర్ పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అంబర్‌నాయక్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వెంట నాఫ్స్‌కాబ్ చైర్మన్ రవీందర్ రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, స్థానిక నాయకులు ఉన్నారు.

ఘనంగా జాతీయ మానవ హక్కుల దినోత్సవం

ఇల్లంతకుంట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి, అంగన్‌వాడీ కేంద్రం, బస్టాండ్‌లో బుధవారం పండ్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల హక్కులను కాపాడటానికి సంఘం కృషి చేస్తుందన్నారు. ఎవరైన వివక్షతకు గురయితే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు కాసుపాక శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు దొడ్ల దేవేందర్, మండల ప్రధాన కార్యదర్శి పినకాసి మనోహర్, సోషల్‌మీడియా ఇన్‌చార్జ్ బ్రహ్మచారి, సహాయకార్యదర్శి శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో సన్మానం

ఇల్లంతకుంట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్కానిపేట గ్రామానికి చెందిన కవి, కళాకారుడు తునికి తిరుపతిని సూర్యపేటలోని శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కళావేదిక ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కవి సమ్మేళనంలో పాల్గొని కవితాగానం చేయగా వేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, ఈశ్వరి భూషణం, పార్థసారధి చేతుల మీదుగా సత్కారం పొందారు. మండలకేంద్రంలోని వాణీనికేతన్ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న తిరుపతి రాణించడంపై ప్రిన్సిపాల్ తూముకుంట శ్రీనిధితో పాటు ఉపాధ్యాయులు బుధవారం అభినందనలు తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలి

రుద్రంగి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చందుర్తి సర్కిల్ సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. రుద్రంగి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎన్నికల్లో పాల్గొనే పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటింగ్ సమయంలో అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ఎన్నికల నియమాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని చందుర్తి ఎస్సై రమేష్ బుధవారం పేర్కొన్నారు. మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ఇప్పటికే మండలంలోని రౌడీషీటర్లను, బెల్ట్‌షాప్ నిర్వాహకులను, గత ఎన్నికల్లో గొడవలు సృష్టించిన 46 మందిని బైండోవర్ చేశామన్నారు. అక్రమంగా నిల్వచేసిన 80 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశామన్నారు. పట్టుకున్న మద్యం విలువ దాదాపు రూ.46వేల వరకు ఉంటుందన్నారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా వ్యవహరించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కరాటే పోటీల్లో ప్రతిభ..

వేములవాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలో గత ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గౌతమ్ విద్యా సంస్థల కరస్పాండెంట్ బూర ఉమా బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరికిషన్ తదితరులు ఉన్నారు.

నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలి

ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



చందుర్తిలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్



వేములవాడలో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ మహేష్ బి గీతె



వేములవాడలో ఎన్నికల సామాగ్రిని తీసుకువెళ్తున్న సిబ్బంది

వేములవాడ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. గ్రామ పంచాయతీ మొదటి ఫేజ్ ఎన్నికల్లో బాగంగా మండల ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగులు బ్యాలెట్ పేపర్లు, ఇతర సామగ్రి సరిచూసుకోవాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన వాహనాల్లోనే సామగ్రిని తరలించాలన్నారు. అనంతరం ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళ్లే వాహనాలను కలెక్టర్ గరిమ అగ్రవాల్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, ఎంపీడీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించిన ఎస్పీ

సర్పంచ్ ఎన్నికల సందర్భంగా సామగ్రిని తరలించే డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఎస్పీ మహేష్ బి. గీతే బుధవారం పరిశీలించారు. పోలింగ్ బూత్‌లకు వెళ్లే వాహనాలతో వెళ్లే సిబ్బందికి పలు సూచనలు చేసారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఉర్పాటు చేసామన్నారు. ఆయన వెంట అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, పట్టణ సీఐ వీరప్రసాద్, రూరల్ సీఐ శ్రీనివాస్, రూరల్ ఎస్సై వెంకట్రాజం ఉన్నారు.

● వేములవాడ టౌన్ : వేములవాడ మండలంలోని 11 గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధమైంది. గురువారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పోలింగ్ జరుగనుంది. ఈ పోలింగ్ నిర్వహణకు వేములవాడ మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి 11 గ్రామపంచాయతీలైన అనుపురం, ఆరెపల్లి, చంద్రగిరి, చీర్లవంచ, చింతల్‌ఠాణా, గుర్రంవానిపల్లి, మారుపాక, రుద్రారం, కొడుముంజ, సంకెపల్లి, శభాష్‌పల్లిలలో 11సర్పంచ్ స్థానాలు, 90 వార్డులలో ఎన్నికలను నిర్వహించే పోలింగ్ బూత్‌లకు గురువారం ఎన్నికల సామగ్రి చేరుకుంది. వేములవాడ మండలంలో 18,482 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 8,953మంది పురుషులు, 9,805మంది మహిళలు, ఇతరులు 16 మంది ఓటర్లు ఉన్నారు. మండలంలో 11 గ్రామాల్లో రెండుజోన్‌లు, మూడు రూట్‌లు, 104పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో జోనల్ అధికారులు, ముగ్గురు రూట్ ఆఫీసర్‌లు, 11మంది ఆర్ఓలు, 253 పోలింగ్ సిబ్బంది గ్రామాల్లోని విధుల్లో చేరారు. ఈ సందర్భంగా జిల్లా ఉప ఎన్నికల అధికారి రాధాబాయి, నోడల్ అధికారి వినోద్‌కుమార్, ఎంపిడిఓ కీర్తన, ఎంఆర్ఓ విజయప్రకాశ్‌రావు, డిస్ట్రిక్ రిసోర్స్‌స్ పర్సన్ మహేందర్‌రెడ్డి, ఉపేందర్‌లు పాల్గొన్నారు.

ఎన్నికల సామగ్రి తరలించే బస్సులను పరిశీలించిన ఎస్పీ

వేములవాడ మండల పరిషత్ వద్ద ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి ఎన్నికల సామగ్రి తీసుకెళ్లే బస్సులను ఎస్పీ మహేష్ బి. గీతే బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వేములవాడ నుంచి 11 గ్రామపంచాయతీలకు 3రూట్‌లలో వెళ్లే బస్సులు జాగ్రత్తగా పోలింగ్ సామాగ్రినిచేర్చే విధంగా ముందువైపు పోలీస్ బందోబస్తు వాహనాలను సమకూర్చారు. వీటిపై ఎస్పీ ఆరా తీశారు. ఈ మార్గాలలో బందోబస్తు ఏర్పాట్లు చూస్తున్న వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్, ఎస్ఐలు ఎల్లాగౌడ్, మోతీరాం, రామ్మోహన్‌లకు పలు సూచనలు చేశారు. ఎన్నికలు జరిగే గ్రామాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి గ్రామానికి అయిదుగురు చొప్పున 60మంది పోలీసులను బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు.

డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించిన ఎన్నికల అబ్జార్వర్

వేములవాడ మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని బుధవారం ఎన్నికల అబ్జార్వర్ రవికుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల పీవోలు, ఏపీవోలకు పలు సూచనలు చేశారు. పోస్టల్ బ్యాలెట్‌లను జాగ్రత్తగా చూసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నోడల్‌అధికారి వినోద్‌కుమార్, వేములవాడ ఎంపీడీవో కీర్తన, ఎంఆర్‌వో అబుబాకర్, తదితరులు పాల్గొన్నారు.

● రుద్రంగి : మొదటి విడుత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. రుద్రంగి మండలంలో పది గ్రామాలు ఉండగా వాటిలో ఏడు గ్రామాల సర్పంచ్, వార్డు సభ్యులను గ్రామస్తులు ఏకగ్రవంగా ఏన్నుకున్నారు. మిగిలిన మూడు రుద్రంగి, మానాల, దెగవాత్ తండా గ్రామలకు గురువారం ఏన్నికలు జరగనున్నాయి. మూడు గ్రామాల్లో సర్పంచ్ పదవి కోసం పది మంది పోటీలో ఉన్నారు. అలాగే మూడు గ్రామాల్లో 38వార్డులు ఉండగా 4 వార్డులు ఏకగ్రీవంగా ఏన్నుకున్నారు. మిగిలిన 34వార్డులో 91 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

● చందుర్తి : రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని ఇన్‌చార్జి కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్



వేములవాడలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల అబ్జర్వర్ రవికుమార్

ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మొదటి ఫేజ్ ఎన్నికలు నిర్వహించనున్న సందర్భంగా చందుర్తి మండలాల్లో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఇన్‌చార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఎస్ఈసీ ఆదేశాల ప్రకారం విధులు నిర్వర్తించాలని సూచించారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, ఇంక ఇతర సామగ్రి సరిచూసుకోవాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన వాహనాల్లోనే ఎన్నికల సామగ్రి తరలించాలని స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. ఆయా డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, డీఎంహెచ్ఓ రవీందర్ రెడ్డి, తహసీల్దార్ భూపతి, ఎంపీడీఓ రాధా, ఎంపీఓ ప్రదీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మొదటి విడత పోలింగ్‌కు కట్టుదిట్టమైన భద్రత

మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగు మండలాలలో ఎన్నికలు సందర్భంగా బందోబస్తుకు వచ్చిన పోలీస్ సిబ్బందికి ఆయా పోలీస్ స్టేషన్‌లలో ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..పోలింగ్ జరుగు సమయంలో, ఓట్ల లెక్కింపు సమయంలో పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రత చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో ప్రతి పోలీస్ అధికారి సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సమయంలో రూట్ మొబైల్ పోలీస్ అధికారులు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ,పోలింగ్ కేంద్రాలు,ఇతర ప్రాంతాల్లో గుంపులుగా లేకుండా జాగ్రత్తపడాలన్నారు. ఏదైనా సమస్య తలెత్తినప్పుడు సంబంధిత అధికారులను సమచారం అందించాలన్నారు.ఎస్పీ వెంట సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రమేష్, పోలీస్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

● కోనరావుపేట : స్థానిక సంస్థల ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. కోనరావుపేటలో 28గ్రామపంచాయతీలు ఉండగా రెండు ఏకగ్రీవం అయ్యాయి. 26గ్రామపంచాయతీలకు 228 వార్డులకు నేడు జరిగే ఎన్నికలకు సర్వం సిద్ధం చేశారు. 238 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి 538 మంది సిబ్బందిని నియమించారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాటు చేశారు.

ఎస్ఈసీ నిబంధనలకు పాటించాలి

రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మొదటి ఫేజ్ ఎన్నికలు నిర్వహించనున్న సందర్భంగా కోనరావుపేట మండలంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఇంచార్జి కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ బుధవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. ఆమె వెంట జడ్పీ డిప్యూటీ సీఈవో గీత, డీఎంహెచ్ఓ రవీందర్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, తహసీల్దార్లు వరలక్ష్మి, ఎంపీడీవో సిగ్గారెడ్డి, ఎంపీఓలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ మొదటి విడత పోలింగ్ సందర్భంగా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశామని జిల్లా ఎస్పీ మహేష్ బిగితే తెలిపారు. మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగు మండలాలలో ఎన్నికలు పురస్కరించుకొని బందోబస్తుకు వచ్చిన పోలీస్ సిబ్బందికి కోనరావుపేట పోలీస్ స్టేషన్లలో ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు.

ఏదైనా సమస్య తలెత్తినప్పుడు సంబంధిత అధికారులను సమచారం అందించాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ నాగేంద్రచారి, ఎస్సై ప్రశాంత్ రెడ్డి తదితరులు ఉన్నారు.



వేములవాడలో ఎన్నికల బందోబస్తును పరిశీలిస్తున్న ఎస్పీ



కోనరావుపేటలో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది



రుద్రంగిలో ఎన్నికల సామగ్రితో వెళ్తున్న సిబ్బంది

గుర్తుల గందరగోళం.. అయోమయంలో అభ్యర్థులు

వేములవాడ రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగంపల్లి గ్రామంలోని వార్డుల్లో అభ్యర్థుల గుర్తుల్లో గందరగోళం నెలకొంది. గ్రామంలోని 1వ వార్డులో ఇద్దరు, 2వ వార్డులో ఇద్దరు, 4వ వార్డులో ఇద్దరు అభ్యర్థులు బరిలో నిలిచారు. అభ్యర్థులకు గౌను, గ్యాస్ స్టవ్ గుర్తులను కేటాయించారు. అభ్యర్థులు గ్రామ కార్యదర్శికి ఫోన్ చేసి తమకు వచ్చిన గుర్తులు తెలపమని కోరగా, ఫోన్ మెసేజ్ ద్వారా వారికి కేటాయించిన గుర్తులను తెలిపాడు. అభ్యర్థులకు కేటాయించిన గుర్తులను గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద అంటించారు. వాటిని పరిశీలించుకోకుండా తాము అనుకున్న గుర్తులతోనే అభ్యర్థులు ప్రచారం నిర్వహించుకున్నారు. బుధవారం ఎన్నికల నిర్వహణ సిబ్బంది పోలింగ్ కేంద్రం వద్ద అంటించిన నమూనా బ్యాలెట్‌లో అభ్యర్థుల గుర్తులు తారుమారయ్యాయి. దీంతో అవాక్కయిన అభ్యర్థులు పంచాయతీ కార్యదర్శి తమకు తెలిపిన గుర్తులు ఇవి కావని ఆగ్రహం వ్యక్తం చేయడంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సంఘటనా స్థలానికి చేరుకున్న ఉన్నతాధికారులు అధికారికంగా కేటాయించిన గుర్తులను అభ్యర్థుల కోసం గ్రామపంచాయితీ కార్యాలయంలో, ఆర్‌వో కేంద్రంలో అందుబాటులో ఉంచామన్నారు. పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా అభ్యర్థులు గుర్తుల వివరాలు తెలపమని కోరగా మెసేజ్ పెట్టిన మాట వాస్తవమైనప్పటికి మొదటి మెసేజ్ పెట్టిన 20 నిమిషాలకు మరో మెసేజ్ పెట్టానన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో అభ్యర్థులకు కేటాయించిన గుర్తుల వివరాలను అంటించామన్నారు.

గౌరవంగా జీవించేందుకు మానవ హక్కులు..

- సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జూపెల్లి శ్రీనివాస్‌రావ్



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జూపెల్లి శ్రీనివాస్‌రావు

తంగళ్లపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి మనిషి గౌరవంగా జీవించేందుకు మానవ హక్కులు మూలాధారం అని సిరిసిల్ల బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు జూపెల్లి శ్రీనివాస్ రావు అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్వర్యంలో న్యాయ సేవాధికర సంస్థ అధ్యక్షురాలు జిల్లా ప్రధాన న్యాయ మూర్తి నీరజ ఆదేశాలతో సీనియర్ సివిల్ జడ్జి కార్యదర్శి లక్ష్మణాచారి సమన్వయంతో బుధవారం తంగళ్లపల్లి మండలం తాడూరు గ్రామంలోని జ్యోతి బీఈడీ కాలేజ్‌లో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకుని న్యాయ విజ్ఞా న సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ న్యాయ సహాయంతో ప్రజల హక్కులను రక్షిస్తోందని అన్నారు. ఈ సదస్సులో లోక్ అదాలత్ సభ్యులు ఆడెపు వేణు, గుర్రం ఆంజనేయులు, కళాశాల ఇంచార్జీ పద్మ విద్యార్థులు పాల్గొన్నారు.

స్వదేశానికి రప్పించాలని మొర

తంగళ్లపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం దుబాయ్ వెళ్లిన తంగళ్లపల్లి మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన ఎర్రోళ్ల భరత్ ఏజెంట్ చేతిలో మోసపోయి ఇబ్బందులు పడుతున్నాడు. బుధవారం సిరిసిల్ల పర్యటనకు వచ్చిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కుటుంబ సభ్యులు కలిసి భరత్‌ను స్వదేశానికి రప్పించాలని మొర పెట్టుకున్నారు. ఏజెంట్ చేతిలో మోసపోయి అనారోగ్య బారిన పడిన విషయాన్ని కేటీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. భరత్ దుబాయ్ నుంచి బాధలు వెళ్లబోసుకుంటున్న వీడియోను కేటీఆర్ దృష్టికి స్థానిక నాయకులు కర్నె బాలయ్య, మోతె మహేశ్‌లు తీసుకువెళ్లారు. భరత్‌ను స్వదేశానికి రప్పిస్తానని కేటీఆర్ హామీ ఇచ్చారు.